క్లుప్తంగా

వెలుగు కార్యాలయంలో వార్షిక ఆడిట్



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు

రోలుగుంట: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఆడిటర్లు రికార్డులు పరిశీలించి వార్షిక ఆడిట్ నిర్వహించారు. దీనిలో భాగంగా 2023–2024 ఆర్థిక సంవత్సరంలో 80 గ్రామ సంఘాలకు ఇచ్చిన రూ.83 లక్షల రుణాలు, జమాబందీ లెక్కలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయి సమాచారం తెలియజేసేందుకు గ్రామ సంఘం ప్రతినిధులకు అవసరమైన సూచనలు చేశారు. ఏరియా కో–ఆర్డినేటర్ కె.సత్యనారాయణ, ఎల్.సి. శ్రీను, ఏపీఎం కె.సాధన పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొండలరావు

మాడుగుల రూరల్: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి మంగళవారం మాడుగులలో నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి పడాల కొండలరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు నేటి యువతరం నడుం కట్టాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు పుట్టా అమరయ్యగుప్తా, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బుడబండి రాజు, యూత్ అధ్యక్షుడు ఏసురాజు, నాయకులు జోగారావు, అప్పారావు పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి. వెంకటాచార్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి



మంగవరంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని ఈవోఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మంగవరం, సత్యవరం గ్రామాల్లోని సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామ కార్యదర్శులతో మాట్లాడి, గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తడి పొడి చెత్తల ద్వారా సంపద కేంద్రాల్లో వర్మి కంపోస్టును తయారు చేయాలని సూచించారు. ఆయన వెంట పాటు గ్రామ కార్యదర్శి ఎస్.నరేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 692 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,460	5,370
మొదటి రకం	3,970	5,060
రెండో రకం	3,800	4,400
మూడోరకం	3,500	3,900

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 99 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–13 యూనిట్లు, బీ పాజిటివ్–47 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–34 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు, ఏబీ నెగిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

బెట్టింగుల జోరు..



- కౌటింగ్ సమీపిస్తున్న కొద్దీ..
- గెలుపోటములపై పందేలు

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ గెలుపోటములపై బెట్టింగుల జోరందుకుంది. ఎన్నికల ఫలితాలు రావడానికి మరో రెండు వారాల సమయం ఉండటంతో ఈ వాతావరణాన్ని క్యాష్ చేసుకోవాలని బెట్టింగ్ రాయుళ్లు తెరపైకి వచ్చారు. వారి ప్రోద్బలంతో కొంతమంది పందేలకు దిగుతున్నారు. అభ్యర్థుల గెలుపుతోపాటు రాష్ట్రంలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? నియోజకవర్గంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి? అన్న దానిపైనే ఎక్కువగా పందాలు కాస్తున్నారు. ఎక్కడ పది మంది కుర్చున్నా.. తమ అభ్యర్థి గెలుస్తాడంటే.. తమ అభ్యర్థి గెలుస్తాడంటూ బెట్టింగులకు దిగుతున్నారు. పల్లెల్లో సైతం పందెంరాయుళ్లు కనిపిస్తున్నారు.

ఫలానా గ్రామంలో తమకు మెజారిటీ వస్తుందంటూ బెట్టింగులు కాసుకుంటున్నారు. రూ.లక్ష కలిపి గెలిచిన వారికి రూ.2 లక్షలు ఇస్తామంటూ చోటా మోటా నాయకుల దగ్గర నుంచి బడా నాయకులు సైతం బెట్టింగులు కట్టుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ కొనసాగుతోంది. పాన్‌షాపులు, టీ దుకాణాలు, రచ్చబండల వద్ద బెట్టింగులపైనే చర్చ సాగుతోంది.

నియోజకవర్గంలో ఫలానా మండలంలో తమ పార్టీకి మెజారిటీ వస్తుందంటే.. తమ పార్టీకి మెజార్టీ వస్తుందనే అంశంపైనా బెట్టింగులు కడుతున్నారు. నియోజకవర్గంలోనే కాకుండా పక్క నియోజకవర్గాలపైనా బెట్టింగులకు దిగుతున్నారు. చివరకు రాష్ట్రంలో అధికారం ఎవరు చేపడతారనే దానిపై పెద్ద స్థాయిలో బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. బెట్టింగుల విషయం బయటకు పొక్కకుండా గప్‌చుప్‌గా పందేలు వేసుకుంటున్నారు.

బెట్టింగ్‌లు చట్టరీత్యా నేరం



గెలుపోటములపై బెట్టింగులు వేయటం చట్టరీత్యా నేరం. బెట్టింగ్‌లకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్‌లు కాసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండకూడదు. బెట్టింగ్‌లు కాసి రోడ్డున పడవద్దు. ఈ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉంది. దయచేసి ఎవరూ బెట్టింగ్‌లకు పాల్పడవద్దు.

– మోహన్, డీఎస్పీ, నర్సీపట్నం

బాలలకు ఉత్సాహంగా ఆటల పోటీలు



బాలలతో కథలు వినిపిస్తున్న దృశ్యం



క్విజ్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

రావికమతం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు ఆటల పోటీలు, కథలు, బుక్ రీడింగ్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పిల్లలకు ఏయే కళల పట్ల మక్కువ ఉందో గుర్తించి వాటిపై తర్ఫీదు ఇస్తున్నారు. ఈ క్రమంలో పోటీలు నిర్వహిస్తున్నామని, వచ్చేనెల 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథపాలకురాలు వరహామణి తెలిపారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. వచ్చే నెల 8వ తేదీ వరకూ రోజూ విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు. చిన్నారులు హాజరై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.



విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహిస్తున్న పద్మావతి

సభలు, సమావేశాలు నిర్వహించొద్దు



నీలకంఠాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఈశ్వరరావు

బుచ్చెయ్యపేట: మండలంలో వచ్చే నెల 4వ తేదీ వరకు రాజకీయ పార్టీ నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించొద్దని ఎస్‌ఐ బి. ఈశ్వరరావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ పోలింగ్ కౌంటింగ్ ముగిసే వరకు ఉంటుందని సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 ఉన్నందున ఏ గ్రామంలోనూ రచ్చబండ, ప్రార్థనా మందిరాలు, కిరాణా షాపులు, కిల్లీ బడ్డీలు వద్ద గుమిగూడి ఉండరాదన్నారు. ముఖ్యంగా సమస్యాత్మకమైన వడ్డాది, కొమ్మళ్లపూడి, రాజాం, పెదపూడి, నీలకంఠాపురం, మల్లాం తదితర గ్రామాల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కౌటింగ్ ముందు తర్వాత ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, రాజకీయ కోణంలో రెచ్చగొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు ఆయా పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

రోడ్డు మార్జిన్‌ను కప్పేసిన తుప్పలు

తరచూ వాహనదారుల ప్రమాదాలు



తాండవ జంక్షన్ గాంధీనగరం మధ్యలో రోడ్డు మార్జిన్ కప్పేసిన వెదురు పొంత కొమ్మలు

నాతవరం: రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా రోడ్డు మార్జిన్‌లో కొమ్మలను తొలగించకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలో నర్సీపట్నం – తుని మధ్య తాండవ జంక్షన్ నుంచి గాంధీనగరం వరకు పెదిమికొండ అడవి ఉంది. ఇక్కడ అటవీ శాఖకు చెందిన వెదురు పొంతలు, భారీ వృక్షాల కొమ్మలు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర కప్పేసి ఏపుగా పెరిగిపోయాయి. దాంతో ఎదురెదురుగా వచ్చే పోయే వాహనదారులు తరుచూ ప్రమాదాలు బారిన పడుతున్నారు. రాత్రిళ్లు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలువురు ప్రమాదానికి గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డు మార్జిన్‌ను కప్పేసిన వెదురు పొంతలు కొమ్మలను తొలగించాలని మండల సర్వసభ్య సమావేశంలో శృంగవరం సర్పంచ్ ఉలబాల శ్రీను, గాంధీనగరం సర్పంచ్ పాతాళ అప్పారావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెదరు పొంతలు అటవీశాఖ పరిధిలోను రోడ్డు మార్జిన్ ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పరిధిలోను ఉండటంతో ఇరు శాఖల అధికారులు పట్టించుకోలేదు. ఈ సమస్యను ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటూ చేతులు దులుపుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా మలుపులు



పాడుగుపాలెం మార్గంలో ప్రమాదకర మలుపు



ఎ.కోడూరు శివాలయం వద్ద..

కె.కోటపాడు: మండలంలో ఎ.కోడూరు నుంచి ఎ.భీమవరం వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రమాదకర మలుపులు దర్శనమిస్తున్నాయి. ఈ మార్గంలోనే చోడవరం, కొత్తవలస, విశాఖపట్నం ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా ఎ.కోడూరు శివాలయం వద్ద, పాడుగుపాలెం మెండిగెడ్డ వంతెన మార్గం, కర్రి వారి కళ్లాల వద్ద, చెరుకు కాటా పరిసరాలు వద్ద మలుపులు ప్రమాదభరితంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ఒక్కసారిగా నియంత్రించలేక వాహనదారులు ఈ మలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆయా మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నైపుణ్యాల వెలికితీతకు వేసవి శిక్షణ



వెస్ట్రన్ డ్యాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

అనకాపల్లి: వేసవి సెలవుల్లో చిన్నారులకు వివిధ కళలపై తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారిలో నైపుణ్యాలను వెలికి తీయవచ్చని కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 10 వరకూ శిక్షణ కొనసాగుతుందన్నారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయాలని నిర్వాహకులను సూచించారు. శిక్షణలో భాగంగా సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డు, గిటార్‌లలో రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ 160 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సినీ ప్రముఖుల అభినందనతో కూడిన జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు.

ఫణిభూషణ్‌కు జీవ వైవిధ్య పురస్కారం



అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ చిన్న బాబుకాలనీకి చెందిన కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌కు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలోని ఏయూలో రాష్ట్ర స్థాయి అవార్డును బుధవారం అందుకోనున్నట్లు గ్రీన్ క్లబ్ ప్రతినిధి ఎస్.ఎఫ్.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2000 సంవత్సరం నుంచి జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం, సాంప్రదాయక విజ్ఞానం ద్వారా జాగృతి కార్యక్రమాలు చేపట్టడంతో ఆయనకు ఈ పురస్కారం దక్కిందన్నారు.

అల్లూరి సంఘం రాక రేపు

పాయకరావుపేట: ఈ నెల 23న అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధుల బృందం మండలంలోని సీతమ్మకొండకు రానున్నట్లు సంఘ కార్యదర్శి లక్కోకుల బాబ్జి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం గ్రామం వద్దనున్న సీతమ్మకొండ(పాండవుల మెట్ట)పై అల్లూరి సీతారామరాజు పూజలు, తపస్సు చేసినట్లు చరిత్ర చెప్తోందన్నారు. కొండపైనున్న ఉమా ధర్మలింగేశ్వరస్వామి ఆలయాన్ని, అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రదేశాన్ని బృందం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, మహర్షి సినిమా ఫేమ్ రాంపల్లి వెంకటరమణ బృందం హాజరుకానున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు



ఏవో వాసుదేవరావు



ఏడీఏ శ్రీదేవి

మాడుగుల: ఈ నెలలో కురిసిన వర్షాలు పచ్చిరొట్ట ఎరువులకు అనుకూలంగా మారిందని ఏవో వాసుదేవరావు మంగళవారం తెలిపారు. ఈ నెల సాధారణ వర్షపాతం 120 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటికే 98 మిల్లీమీటర్లు నమోదు అయిందన్నారు. ఈ నేపథ్యంలో భూమి సారవంతం కోసం పచ్చిరొట్ట ఎరువులుగా పిల్లిపెసర, కట్టి జనుము, జీలుగు వేసుకోవాలన్నారు. ఆర్బీకేల్లో సబ్సిడీపై ఈ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కేజీ కట్టి జనుము రూ.88 కాగా 50 శాతం సబ్సిడీపై రూ.44కు, జీలుగు కేజీ రూ. 88 కాగా సబ్సిడీపై రూ44కు, పిల్లిపెసర కిలో రూ.134 కాగా సబ్సిడీపై రూ.67కు అందజేస్తామన్నారు. రైతులు ఆర్బీకేల్లో సబ్సిడీపై సొమ్ము చెల్లించి నమోదు చేసుకున్న రెండు రోజుల్లో అందజేస్తామన్నారు.

రావికమతం: ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి రూప మంగళవారం తెలిపారు. తొలకరి వర్షాలు పడుతున్న తరుణంలో రైతులు వేసవి దుక్కులు చేసుకుని పచ్చిరొట్ట ఎరువులుగా జనుము, జీలుగ, పిల్లిపెసర వేసుకుంటే భూమి సారవంతమవ్వడమే కాక తదుపరి వేసే పంటలో మంచి దిగుబడులు వస్తాయన్నారు. రసాయనిక ఎరువుల అవసరం ఉండదని తెలిపారు.

నర్సీపట్నం: రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ పి.శ్రీదేవి మంగళవారం తెలిపారు. వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో నర్సీపట్నం, రోలుగుంట, గొలుగొండ, రావికమతం, వి.మాడుగుల మండలాలు ఉన్నాయన్నారు. 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. జీలుగ 62 క్వింటాళ్లు, జనుము 23.5 క్వింటాళ్లు, పిల్లిపెసర 16.6 క్వింటాళ్లు, అన్ని రకాలు కలిపి మొత్తం 102.1 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు ఇండెంట్ పెట్టామన్నారు. సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రావికమతం ఆర్బీకేలో పచ్చిరొట్ట ఎరువులు

పచ్చిరొట్టతో లాభసాటి వ్యవసాయం

దేవరాపల్లి: భూమి సారవంతం కావాలన్నా, పంట దిగుబడిలో అన్నదాతకు మేలు జరగాలన్నా, తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించాలని ఏవో వై.కాంతమ్మ సూచించారు. వీటి వాడకం ద్వారా వ్యవసాయం ఎంతో లాభసాటి అవుతుందన్నారు. తొలకరి జల్లులు కురుస్తున్న నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధం కావాలన్నారు. ఖరీఫ్ వరి విత్తనాలు వేసేలోగా ప్రతి పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు జల్లాలన్నారు. ఇవి ఆర్బీకేల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

వరి నారుమడులకు సన్నద్ధం



వీరనారాయణంలో తయారు చేసిన వరినారు మడి

మాడుగుల రూరల్: ముందస్తుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ముందుగా కురిసిన వర్షాల వల్ల ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు దున్నిస్తున్నారు. దీంతోపాటు చెరకు నాట్లు వేయడానికి గాను దుక్కులు దున్నుతున్నారు. ప్రస్తుతం రైతులు మెట్ట భూముల్లో సరుగుడు నారు వేస్తున్నారు.

త్రిపురాంతక స్వామి కల్యాణం రేపు





కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో వెలసిన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి 108వ కల్యాణోత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. ఏటా వైశాఖ మాసం పౌర్ణమి రోజున కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. సుమారు నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో గత 107 సంవత్సరాలుగా ఏటా స్వామి వారి కల్యాణాన్ని సంప్రదాయంగా జరిపిస్తున్నారు. ఈ ఏడాది నిర్వహించే కల్యాణం 108వది కావడంతో భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఇప్పటికే స్వామివారి పెళ్లి రాట ఉత్సవాన్ని జరిపారు. 23న సాయంత్రం 6 గంటలకు వేదమంత్రాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా ఆలయ ప్రాంగణంలో కల్యాణం జరగనుందని ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణ తెలిపారు. మధ్యాహ్నం భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు శివ సన్నిధి గ్రూపు ప్రతినిధులు పెతకంశెట్టి భాస్కరరావు, సూరిశెట్టి సూర్య వెల్లడించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు

ఎంపీడీవో జాగరపు రాంబాబు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. ఆయన మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో తన కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు వచ్చే నెల 4వ తేదీ వరకు ఎన్నికలు కోడ్ అమలులో ఉంటుంన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్ ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులకు ప్రజలకు తెలియజేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున పంచాయతీల్లో తాగునీటి వనరులను క్లోరినేషన్ ఎప్పటికప్పుడు చేయాలన్నారు. వీధుల్లో డ్రైనేజీలు శుభ్రం చేయాలన్నారు. పలు పనులపై సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కొన్ని గ్రామాల్లో సమయపాలన పాటించలేదని, తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారు పని తీరులో మార్పు రావాలన్నారు. ప్రస్తుతం అధికంగా రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఆర్బీకేలకు వస్తారని సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి. మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాల సాగుతో భూములు సారవంతం



సుందరయ్యపేటలో పీఎండీఎస్ విత్తనాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కశింకోట: ప్రకృతి వ్యవసాయ పద్ధతిల ద్వారా తమ పంట భూములను రైతులు సారవంతం చేసుకోవాలని మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి కూండ్రపు అరుణ సూచించారు. సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తొలకరిలో భూమిని సారవంతం చేసుకునేందుకు ఉపకరించే పీఎండీఎస్ 30 రకాల కూరగాయల విత్తనాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట భూములను సారవంతం చేసుకోవడానికి పీఎండీఎస్ విత్తనాలను తొలకరి వర్షాల్లో జల్లుకోవాలన్నారు. ఇవి 45 రోజుల్లో ఏపుగా ఎదుగుతాయన్నారు. వీటిని నేలలో కలియ దున్నుకుంటే సహజసిద్ధ ఎరువుగా ఉపయోగపడతాయన్నారు. హానికరమైన కృత్రిమ ఎరువులు వాడాల్సిన పని ఉండదన్నారు. ఎకరా భూమికి 12 కిలోల పీఎండీఎస్ విత్తనాలు సరిపోతాయన్నారు. వీటిని ఒక కిట్‌గా రూ.800కే ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. వీటిని ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న 13 గ్రామాల రైతులు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సాగు రైతులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ బస్సు డ్రైవరు మృతికి సంతాపం

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామానికి చెందిన బ్రాండిక్స్ –3 బస్సు డ్రైవరు తోరాతి ప్రసాదు సోమవారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. పదేళ్లుగా ఆయన అచ్యుతాపురం బ్రాండెక్స్ యూనిట్ –3కు చెందిన బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నారు. ప్రసాదు భౌతికదేహానికి బ్రాండిక్స్ కంపెనీకి చెందిన మహిళా ఉద్యోగులు, సహచర డ్రైవర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన భార్య కూడా ఇదే కంపెనీలో పనిచేస్తోంది. వీరి కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఉన్నారు. గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో థ్రాంబోలైసిస్ ఇంజక్షన్



రోగిని పరిశీలిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఎమర్జెన్సీ వార్డ్‌లో హార్ట్‌ఎటాక్ వచ్చిన రోగికి 6 గంటల లోపు అందించాల్సిన రూ.40 వేలు విలువచేసే థ్రాంబోలైసిస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైద్యుడు జి.రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బడుగు, బలహీన వర్గాల రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్యం అందుతోందన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి, వారి కుటుంబ సభ్యుల్లో నమ్మకం పెంచాలని వైద్య సిబ్బందిని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్‌ను త్వరలో రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, వైద్యులు జి.కృష్ణ, కృష్ణచంద్ర, మరో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.